జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 13-2-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 246 పేజీలు: 4 వెల : రూ.7




## పనులు కావాలంటే..
# పైసల్ ఇవ్వాల్సిందే!

*** లేకుంటే.. నిబంధనలు గుర్తొస్తాయి * కార్యాలయం చుట్టూ తిప్పుతునే ఉంటారు * చెప్పినంత ఇస్తే.. చకచకా పనులు * ఈసీ నుంచి కాపీలు వరకు చేయి తడపవలసిందే * కాశీబుగ్గ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నడుస్తున్న తంతు * చోద్యం చూస్తున్న జిల్లా అధికారులు**

పలాస/శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 12 (వార్త):ప్రభుత్వ నిబంధనలు ప్రకారం కాశీబుగ్గ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరగాల్సిన విధులు ఇక్కడ అమలు కావడంలేదన్న విమర్శలు ఉన్నాయి. అయితే కాశీబుగ్గలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో అంతా మనీ మాయాజాలమే నడుస్తుందని టాక్. ఒకే ఒక్కడు.. ఇక్కడ మొత్తం కథంతా నడుపుతున్నాడు. ఇక్కడకు భూముల క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్లే కాకుండా.. ఈసీ నుంచి కాపీ వరకూ అతగాడికి చేయి తడపాల్సిందే. అతడే కింది స్థాయి నుంచి మీద స్థాయికి కాసులు సర్దుతుంటాడన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఇక్కడ సబ్ రిజిస్ట్రార్.. కార్యాలయంలో ఉన్న కుర్చీలో ఉండి విధులు నిర్వహించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఆ సబ్ రిజిస్ట్రార్ తనకు కేటాయించిన కుర్చీలో కాకుండా సిబ్బంది ఉండే ముందు గదినుంచి రిజిస్ట్రార్ విధులు నిర్వహిస్తుంటాడు. ఇదేంటని ప్రశ్నిస్తే నా ఆఫీసు.. నా ఇష్టం అన్న మాదిరిగా వ్యవహరిస్తుంటాడని పలువురు చెబుతున్నారు. ఇక్కడ స్టాంపు వెండర్లు ఏం చెబితే అదే చేస్తాడు. సిబ్బంది మాటను అస్సలు పట్టించుకోడు.. అంటూ కొందరు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఒక్కో పనికి ఒక్కొక్క ధరగా కక్షి దారుల నుంచి వసూలు చేస్తున్నరన్న ఆరోపణలు లేకపోలేదు. నిజానికి నిబంధనలు మేరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం దగ్గర్లో స్టాంప్ వెండర్లు ఉండకూడదన్న నిబంధనలు ఉన్న ఇక్కడ ఆ నిబంధన పనిచేయదు. ప్రతీ పనికి డబ్బులు గుంజడం ఈ కార్యాలయంలో కొందరు సిబ్బంది పెట్టుకున్నారు. డబ్బులు ఇవ్వనిదే ముందుకు సాగడం లేదు. మార్కెట్ వాల్యుయేషన్ సర్టిఫికెట్ల జారీకి అడ్డగోలు వసూళ్లుతో పాటు రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నరని కొనుగోలు, విక్రయదారులు వాపోతున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి రాజ్యమేలుతోందని బాధితులు ఆరోపిస్తున్నారు. పైసలియ్యకపోతే గంటలో కావాల్సిన పనికి రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిప్పుతునే ఉంటారు. ఇదేమిటని ప్రశ్నించిన వారిని ఎక్కడ చెప్పుకుంటారో చెప్పుకోండి అని సమాధానం ఇస్తున్నారు. కాశీబుగ్గ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నడుస్తున్న తంతుపై కొందరు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారు. అక్కడ కూడా అధికారులు స్పందించకపోతే ఉద్యమం చేపడతామని పలు ప్రజా సంఘాల నాయకులు హెచ్చరిస్తున్నారు.



## నేరాల ఛేదనలో..
# సీసీ కెమేరాలు కీలకం

*** సమగ్ర దర్యాప్తుతో ప్రాపర్టీ కేసులు పరిష్కరించాలి * నేరస్థుల కదలికలపై నిఘా ఉంచండి * లోక్‌అదాలత్‌లో కేసులు రాజీ చేసేలా చూడాలి * జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి**



**శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 12 (వార్త):** నేర ఛేదనలో సీసీ కెమెరాలు కీలకమని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు.ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రతి ఒక్క గ్రామంలో, కూడళ్లలో, ఇతర ముఖ్యమైన ప్రదేశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని సూచించారు. సమగ్రమైన దర్యాప్తుతో ప్రాపర్టీ కేసులు త్వరితగతిన ఛేదించి, కేసు ప్రాపర్టీ రికవరీ శాతాన్ని పెంచాలని జిల్లా పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ వర్చువల్ ద్వారా జిల్లా వ్యాప్తంగా ఉన్న డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో చైన్ స్నాచింగ్, వాహనాలు, ఆలయాల్లో దొంగతనాలు, సీసీ కెమెరాలు ఏర్పాటు, తదితర అంశాపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ కేసుల దర్యాప్తులో భాగంగా ఇటీవల జైలు నుంచి విడుదల అయిన నేరస్థులు కదలికలు, సీసీ కెమెరాలు,ఇతర భౌతిక ఆధారాలు,సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నేరస్తులను గుర్తించి వేగవంతంగా కేసులు పరిష్కరించాలన్నారు. నేర ప్రవృత్తి, తరహా, విధానం బట్టి నేరస్తులను పట్టుకోవడానికి అవకాశం ఉంటుందని ఆ దిశగా దర్యాప్తు చేయాలని సూచించారు. ప్రత్యేక బృందాలతో పాత నేరస్తులు, అనుమానిత వ్యక్తులు వారి జీవన విధానం, కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టాలని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలను అవగాహన కల్పించి చైతన్యం తీసుకురావాలన్నారు. దొంగతనాలు ఇతర ప్రాపర్టీ నేరాలను నియంత్రించడానికి గస్తీని ముమ్మరం చేయాలన్నారు. నేరాల కట్టడి చేయడానికి నిర్మానుష్య ప్రాంతాలలో, ముఖ్యమైన ప్రదేశాలలో పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. మహిళలు, మైనర్ బాలికలపై జరిగే నేరాలు, కేసులు నమోదు దర్యాప్తు తదితర అంశాలపై జిల్లా ఎస్పీ ఆరా తీసి, నిర్ణీత గడువులోగా ఛార్జ్ షీట్ కోర్టులో దాఖలు చేయాలని సూచించారు. రానున్న లోక్ అదాలత్‌లో రాజీ పడేందుకు అవకాశం ఉన్న కేసులను గుర్తించి ఎక్కువ మొత్తంలో కేసులు డిస్పోజు అయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను జిల్లా ఎస్పీ సూచించారు.
ప్రతీరోజు విజిబుల్ పోలీసింగ్ విధానంతో మైనర్ డ్రైవింగ్, లైసెన్స్ రహిత డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, న్యూసెన్స్ కేసులు నమోదు చేయాలని,అక్రమ రవాణా అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులు ను జిల్లా ఎస్పీ అదేశించారు. జూమ్ కాన్ఫరెన్స్‌లో జిల్లా పోలీసు కార్యాలయం నుంచి జిల్లా ఎస్పీతోపాటు డిసిఆర్బి సిఐ శ్రీనివాసరావు, సైబర్ సెల్ సీఐ శ్రీనివాస్, ఎస్సైలు కోటేశ్వరరావు, గోవిందరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.




## నేడు తండేల్ సక్సెస్ మీట్

**☞ నిర్మాత బన్ని వాసు ☞ హాజరుకానున్న తండేల్ సినిమా యూనిట్ సభ్యులు**

**శ్రీకాకుళం, ఫిబ్రవరి12 (వార్త):**తండేల్ సినిమా సక్సెస్ మీట్‌ను గురువారం సాయంత్రం ఐదు గంటలకు శ్రీకా కుళం నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో నిర్వహిస్తున్నామని, విజయ వంతం చేయాలని చిత్ర నిర్మాత బన్ని వాసు కోరారు. నగరంలోని నాగావళి హెూటల్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. చిత్రాన్ని విజయవంతం చేసిన అన్ని వర్గాల ప్రజలకు ధన్య వాదాలు తెలిపారు. థియేటర్లలో హౌస్‌ఫుల్ కనెక్షన్లుతో కొన సాగడం ఆనందంగా ఉందన్నారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన మత్స్యకారులకు జరిగిన యదార్ధ సంఘటన ఆధారంగా చిత్రాన్ని నిర్మించినందుకు, అందుకు సహకరించిన వారికి వాసు ధన్య వాదాలు తెలిపారు. విజయోత్సవ సభకు సినీ నిర్మాత అల్లు అర వింద్, హీరోహీరోయిన్లు నాగచైతన్య, సాయిపల్లవి, సంగీత దర్శకులు దేవీశ్రీప్రసాద్ తదితరులు హాజరవుతున్నారన్నారు. పాకిస్తాన్‌లో చిక్కుకొని అనంతరం విడుదలైన 22 మంది మత్స్యకారులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించామని పేర్కొన్నారు. సక్సెస్ మీట్‌కు అనుమతినిచ్చిన పోలీస్ అధికారులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. విలేకరుల సమావేశంలో తండేల్ మూవీ కథా రచయిత కార్తీక్ పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక



**శ్రీకాకుళం**

## రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

**భామిని, ఫిబ్రవరి 12(వార్త):** భామిని మండలంలోని గురండి, చిన్నదిమిలి, కొరమ గ్రామాల్లోని రైతులతో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి కె. సింహాచలం మంగళవారం సమావేశం నిర్వహించారు. భూమి ఉన్న ప్రతి రైతు స్థానిక రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషనుతో పాటు రబీ కాలంలో వేసిన పత్తి పంటను నమోదు చేసుకోవాలని రైతులుకు ఆయన సూచించారు. ఈ రిజిస్ట్రేషన్ ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే పథకాలకు అర్హత పొందుతారన్నారు.



## కాపుగోదాయవలసను సందర్శించిన డీఎంహెచ్‌వో



**సంతబొమ్మాళి, ఫిబ్రవరి 12(వార్త):** కాపు గోదాయవలస గ్రామాన్ని బుధవారం ఎన్ఆర్‌హెచ్ఎం బృందంతో డీఎంహెచ్‌వో బాలమురళీకృష్ణ సందర్శించి జిపిఎస్ వ్యాధితో బ్రెయిన్ డెడ్ అయి చనిపోయిన వాతాపి యువంత్ కుటుంబ సభ్యులను పరామర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వ్యాధి లక్షణాలు, ఎక్కడ ట్రీట్మెంట్ తీసుకున్నారన్న విషయాన్ని మృతుడి తల్లిదండ్రులు చిరంజీవి, రోజాకు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గొంతు నొప్పి, జ్వరం ఉన్న ఆరుగురు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం డీఎంహెచ్ఓ మాట్లాడుతూ వివిధ ఆసుపత్రులు ఇచ్చిన డాక్యుమెంట్లో పరిశీలించామని ఒకరు మాత్రం జిపిఎస్ వ్యాధిగా గుర్తించారని మిగిలిన వారు కన్ఫర్మ్ చేయలేదని అన్నారు. ఒకవేళ జిపిఎస్ వ్యాధి అయి ఉంటే ఇది చాలా రేర్ కేసు అని, రెండు లక్షలు, ఐదు లక్షలు మందిలో అరుదుగా వచ్చే వ్యాధి అని అన్నారు. ఇలాంటి కేసు మన రాష్ట్రంలో ఎక్కడా లేదని మహారాష్ట్రలో నమోదు అయిందని అన్నారు. జిపిఎస్ వ్యాధి అయి ఉంటే ఇంత త్వరగా మృతి చెందడం విచారకరమని అన్నారు. పుట్టెడు దుఃఖంలో కూడా తల్లిదండ్రులు అవయవ దానానికి ముందుకు రావడం పలువురికి ప్రాణదాతలు కావడం మంచి నిర్ణయమని తెలిపారు.

గ్రామంలో నీటి సామర్థ్య పరీక్షలు నిర్వహించి, మెడికల్ క్యాంపులో ఏర్పాటు చేసి ఇంటింటా సర్వే చేయాలని వైద్య సిబ్బందికి డిఎం అండ్ హెచ్ ఓ ఆదేశించారు. అంతకుముందు స్థానిక సర్పంచ్ అంగ లక్ష్మి, జనార్ధన్, మల్లేష్ మాట్లాడుతూ గ్రామానికి 104 సేవలు అందించాలని, 108 వాహనం కాల్ చేసిన రావడంలేదని లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. 104,108 సేవలు మీ గ్రామంలో అందుబాటులో ఉంటాయని ఓ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో మేరీ కేథరిన్, డిపిఎమ్ఓ వాన సురేష్ కుమార్ తదితరులు ఉన్నారు.

## అంతర్జాతీయ కరాటే పోటీల్లో బ్రిలియంట్ విద్యార్థుల సత్తా




**కొత్తూరు, ఫిబ్రవరి 12 (వార్త):** విశాఖలోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో ఈ నెల ఒకటి, రెండవ తేదీల్లో జరిగిన ఎనిమిదవ అంతర్జాతీయ కరాటే పోటీలలో కొత్తూరు మండలంలోని బ్రిలియంట్ వరల్డ్ స్కూల్ విద్యార్థిని, విద్యార్థులు సత్తా చాటారు. ఈ పోటీలలో తొమ్మిది దేశాల నుంచి పాల్గొన్నారు. ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్షిప్ పోటీల నందు భారతదేశపు తరఫున రిప్రెజెంటేషన్ చేసిన కొత్తూరు లోని బ్రిలియంట్ వరల్డ్ స్కూల్ విద్యార్థిని, విద్యార్థులు కరాటే మాష్టారు సింహాచలం ఆధ్వర్యంలో ఇండియా లెవెల్ లో ప్రథమ స్థానం సాధించి తెలుగు సినిమా హీరో సుమన్ చేతుల మీదుగా ట్రోఫీని అందుకున్నారు. అలాగే ఈ స్కూల్ విద్యార్థిని విద్యార్థులు పది మంది కి మెడల్స్, కప్ గెలుపొందటం జరిగింది. ఈ పోటీల ద్వారా ప్రథమ స్థానం సాధించడంతో బ్రిలియంట్ వరల్డ్ స్కూల్ యాజమాన్యానికి విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

## ఆదివాసీల మారణకాండను తక్షణమే నిలిపివేయాలి

**-ప్రజా సంఘాల డిమాండ్**




**పలాస, ఫిబ్రవరి 12(వార్త):** మధ్య భారతంలోని అడవుల్లో మోడీ ప్రభుత్వం నెత్తుటేరులు పారిస్తున్నదనీ బీజాపూర్ లో మరో 31 మంది మావోయిస్టుల్ని ఎదురు కాల్పుల పేరిట చంపిందనీ ఎదురు కాల్పులకు బలం చేకూర్చే కట్టుకథల్లో భాగంగా, ఇద్దరు జవాన్లు కూడా మరణించారని, అధికారులు రిపోర్ట్ చేసారనీ, ఆ చనిపోయిన వారిలో ఆదివాసులు ఎందరో, మావోయిస్టులు ఎందరో స్పష్టత లేదనీ, ఆదివాసీల మారణకాండనుతక్షణమే నిలిపి వేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పలాస మండలం బొడ్డపాడులో వీరు సమావేశమై ఈ మారణకాండను తీవ్రంగా ఖండించారు. ఏ ఐ కె యం యస్ జిల్లా నాయకులు గొరకల బాలకృష్ణ, పీవోడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, రైతు కూలీ సంఘం నాయకులు రాపాక మాధవరావు, పీవైయల్ జిల్లా కన్వీనర్ సార జగన్, ఐ ఎఫ్ టి యు జిల్లా నాయకులు పి.మల్లిబాబు తదితరులు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో ప్రభుత్వ రంగానికి మన దేశ ప్రజల అడవుల్ని అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లకు అప్పగించే పథకం పన్నిందనీ దానికి అడ్డంకిగా వున్న ఆదివాసీల మపై యుద్ధం ప్రకటించిందన్నారు. అటవీ సంపదను ఖనిజాలను వనరులను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి మోదీ ప్రభుత్వం ప్రజలపై ఎంతటి హింసను ప్రయోగించడాని కూడా వెనుకాడడం లేదని వారు విమర్శించారు. దేశంలో ఆదివాసీలపై జరిగే హింసాకాండను కేవలం ఆదివాసీల సమస్యగా చూడొద్దని, అటవీ సంపద దేశ వ్యాప్తంగా ప్రజలందరి సంపదగా భావించి దేశప్రజలందరు మోడీ కగార్ కి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలనీ, విప్లవ, వామపక్ష, పౌర హక్కుల సంఘాలతో కలిపి రాష్ట్ర వ్యాపితంగా పోరాడతామన్నారు. మోడీ సర్కార్ భిన్నాభిప్రాయం వ్యక్తం చేసిన ప్రతిపక్షాలకి కూడా అర్బన్ నక్సల్స్ గా ముద్రలు వేస్తుందని ఇప్పటికే ఆదివాసీలను అడవుల నుండి గెంటి వేయడానికి 1/70 చట్టాన్ని, పీసా చట్టాన్ని నీరు గార్చే చర్యలకు పూనుకుందని విమర్శించారు. 2026 నాటికి నక్సల్స్ రహిత భారత్ ను ఏర్పాటు చేస్తామనే పేరుతో ఆదివాసీ ప్రాంతాలలోపారా మిలిటరీ బలగాలను, కోబ్రాలను రకరకాల పోలీస్ బలగాలని ఉపయోగించి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంను ఉపయోగించి, ఈ సామూహిక హత్యలకు మోడీ ప్రభుత్వం పాల్పుతుందన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో జరుగుతున్న హింసాకాండను ఊచకోతలను తక్షణమే నిలిపి వేయాలని తీవ్రంగా ఖండించారు. దీనిపై సుప్రీం కోర్టు న్యాయ విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



## వాసుదేవుని బ్రహ్మోత్సవాలకు కలెక్టర్‌కు ఆహ్వానం

**మందస, ఫిబ్రవరి 12(వార్త):** శ్రీవాసుదేవ పెరుమాళ్ వార్షిక బ్రహ్మోత్సవాలకు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ఆహ్వానించారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలసి ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు(కూర్మాస్వామి), పీరుకట్ల విఠల్‌రావు, మాజీ సర్పంచ్ డుంకురు తిరుపతిరావు, రాజాన మహేశ్, కరతల తిరుపతిరావు, జామి ప్రసాద్, సంతోష్ కుమార్ పండా, కిల్లి బాలకృష్ణ, రోథియా చక్రి తదితరులు కలెక్టర్ను ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. వాసుదేవుని పూజించిన దుశ్శాలువతో కలెక్టర్ పుండ్కర్‌ను సన్మానించి, స్వామివారి 16వ బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికను అందజేసి, బ్రహ్మోత్సవాల్లో పాల్గొని, స్వామి తీర్థ, ప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

## సబ్ కమిటీల పనితీరే కీలకం




**మందస, ఫిబ్రవరి 12(వార్త):** మండల సమాఖ్యలు, గ్రామ సంఘాలు సమర్థవంతంగా నడిచేందుకు సబ్ కమిటీల పనితీరే కీలకం అని వెలుగు ఐటిడిఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. స్థానిక మండల సమాఖ్యలో సవర కాంతమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సమాఖ్య పాలకవర్గ సభ్యులు మరియు క్లస్టర్ కోఆర్డినేటర్ల శిక్షణా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సంస్థల బలోపేతానికి సమర్థవంతమైన నాయకత్వం ఉండి ,మంచి పాలన అందించాలన్నారు. ఏడు రకాల సబ్ కమిటీలు వారి బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ, కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్ వారి యొక్క హుమన్ రిసోర్సును సక్రమంగా వినియోగించుకోవడంపై అవగాహన కల్పించారు. సిబ్బంది నియామకం తో పాటు, వారి పనితీరు ను సమీక్షించి, గౌరవ వేతనాన్ని ఇచ్చే అధికారం కమ్యూనిటీ సభ్యులకే ఉన్నందున, సిబ్బంది పనితీరును మెరుగుపరుచుకోవలసిన బాధ్యత పూర్తిగా సంస్థలకే ఉన్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల సమైక్య అకౌంటెంట్ కళ్యాణి తో పాటు ఎం.ఎం.ఎస్. సిబ్బంది, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## సూర్యఘర్ అమలుకు సర్వే చేయండి

**వంగర, ఫిబ్రవరి12(వార్త):** సొంత ఇల్లు ఉండి కరెంట్ బిల్లు 850 దాటి వస్తే అటువంటి వారికి పీఎం సూర్య ఘర్ పథకం కింద రాయితీపై ఇళ్ల పైన సోలార్ రూఫ్ టాప్ లను అమర్చడానికి సంఘ సభ్యుల గుర్తింపు సర్వే చేయాలని ఎసి చిరంజీవి వెలుగు అధికారులకు సూచించారు. బుధవారం ఆయన మండల వెలుగు సమాఖ్య కార్యాలయంలో సీసీఎస్, వీవోఏలతో సెర్ప్, డి.ఆర్.డి.ఏ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ప్రతీ వీఓఏ పరిధిలో రెండు చొప్పున పీఎం ఈజీపి పథకం కింద బ్యాంకుల అనుసంధానంతో లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. ఫుడ్ ప్రాసెసింగ్‌కు సంబంధించి చిన్న యూనిట్లు మంజూరుకు సంబంధించి సభ్యులను గుర్తించి వారికి సెడ్ కాపిటల్ కింద ఒక్కొక్కరికి రూ.40000లు వంతున రుణం అందేలా చర్యలు తీసుకోవాలని ఏపీఎంను కోరారు. మండలంలో అర్హత గల ఎస్‌హెచ్ జీ సంఘాలన్నింటికీ బ్యాంకు లింకేజి అప్పులు అందేటట్లు సిబ్బంది కృషి చేయాలని, ఫిబ్రవరి నెలాఖరు లోపు అనుకున్న లక్ష్యాలను పూర్తిచేయాలని కోరారు. ప్రతీ రోజు షెడ్యూల్ ప్రకారం మొబైల్ బుక్ కీపింగ్ లో సంఘం లావాదేవీలు నమోదు చేసి సంఘ సమావేశాలు సక్రమంగా జరిగేటట్లు చూడాలని ఆదేశాలు జారీ చేశారు. ఇక నుంచి సంఘాలు నెలకు ప్రతీ సంఘం రూ.200లు పొదుపు చేసేటట్లు చూడాలని సూచించారు. ఎన్ఆర్ఎల్ఎం ద్వారా అమలు చేస్తున్న లోకోస్ మొబైల్ యాప్ లో పెండింగ్ లో ఉన్న సంఘాలు ప్రొఫైల్స్ పూర్తి చేయాలన్నారు. స్త్రీ నిధి, ఉన్నతి, సీఐఎఫ్ ద్వారా పొందిన రుణాలు రికవరీ శత శాతం ఉండాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఏపీఎం టీ.మంగమ్మ, స్త్రీ నిధి ఏపీఎం టి.సీతారాం, పలువురు వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## సోమేశ్వరరావు కుటుంబానికి ఎమ్మెల్యే శిరీష పరామర్శ

**మందస, ఫిబ్రవరి 12(వార్త):** బహడపల్లి మాజీ సర్పంచ్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు సార సోమేశ్వరరావు ఆకస్మికంగా మరణించారు. ఈ విష యం తెలుసుకున్న పలాస ఎంఎల్ఏ గౌతు శిరీష..ఆయన కుటుంబాన్ని పరామ ర్శించారు. వారిని ఓదార్చి, సోమేశ్వరరావు ఆత్మకు శాంతి కలగాలని దేవుని ప్రార్థించారు. పలాస-కాశీబుగ్గకు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ టి.బాలకృష్ణ కూడా సోమేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో పీరికట్ల విఠల్ రావు, టీడీపీ మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, వర్కింగ్ ప్రెసిడెంట్ రట్టి లింగరాజు, ఎంపీటీసీ వాయలపల్లి మాధవరావు, లబ్బ రుద్రయ్య, మామిడి తాతారావు పాల్గొన్నారు





## నాటుసారాతో ముగ్గురి అరెస్టు

**మందస, ఫిబ్రవరి 12(వార్త):** మందస మండలంలోని బుడారిసింగి పంచాయతీలో గల కళింగదకు చెందిన నెయ్యిల కేశవరావు అనే వ్యక్తి 20 లీటర్ల నాటుసారా అమ్ముతుండగా పట్టుకున్నట్టు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ కె.బేబీ తెలిపారు. బెత్తుకోల గ్రామానికి చెందిన సవర భీమారావు, బహడపల్లికి చెందిన రత్నాల శకుంతలను 14.5 లీటర్ల నాటుసారాతో పట్టుకుని, అరెస్ట్ చేశామన్నారు.

**ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే మద్యం విక్రయించాలి**

రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే మద్యం విక్రయాలు జరగాలని సీఐ బేబీ తెలిపారు. ఇటీవల సవరించిన మద్యం ధరలు ఈ నెల 11వ తేదీ నుంచి అమల్లోకి వచ్చాయన్నారు. రూ.99లు, బీర్ల ధరలు పెరగలేదని, అత్యధిక బ్రాండ్లు రూ.10లు, ఖరీదైన కొద్ది బ్రాండ్లు మాత్రమే రూ.20ల నుంచి 10శాతం వరకు పెరిగాయన్నారు. ప్రతీ బ్రాండ్కు పాత, కొత్త ధరల పట్టికలను ఆయా దుకాణదారులకు ఇప్పటికే అందజేశామన్నారు. అన్ని దుకాణాల్లో యజమానులు ఎంఆర్పీ పట్టికను ఫ్లెక్సీల రూపంలో పెట్టాలని ఆదేశించారు. నిర్ణయించిన ధరల ప్రకారమే మద్యం కొనుగోలుదారులు కొనుగోలు చేయాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో బైకిస్టుకు తీవ్ర గాయాలు



**పలాస, ఫిబ్రవరి 12(వార్త):** పలాస మండలం నెమలి నారాయణపురం గ్రామ సమీప జాతీయ రహదారిపై ప్రమాదం చోటుచేసుకుంది. బుధవారం కారు బైకు ఢీకొట్టిన ఘటనలో మందస మండలం బాలిగాం గ్రామానికి చెందిన గున్న శ్రీనుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని నేషనల్ హైవే అంబులెన్స్లో పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. కాగా ప్రమాదానికి కారణమైన కారుతో సహా డ్రైవర్ పరార య్యాడు. దీంతో కారు డ్రైవర్ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ సంఘటనపై కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పొగ మంచుతో జీడి పూతకు ఎఫెక్ట్



**భామిని, ఫిబ్రవరి 12(వార్త):** భామిని మండలంలో గత కొన్ని రోజులుగా తెల్లవారుజామున కురుస్తున్న పొగ మంచుతో జీడి పూత ఎఫెక్ట్కి గురవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జీడి పూత ఆశాజనకంగా ఉంది ఇంకా మరికొన్ని రోజులు ఈ పొగ మంచు కురిస్తే, జీడి పూత మాడిపోతుందని.. దీంతో జీడి పంట దిగుబడి తగ్గుతుందని రైతులు వాపోతున్నారు.

## పరీక్షల భయం విడనాడాలి

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 12(వార్త):** మండల విద్యాశాఖ అధికారి కురమాన అప్పారావు మునిసిపల్ బాలికోన్నత పాఠశాల ఇచ్ఛాపురంలో నిర్వహిస్తున్న పదవ తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులను పరిశీలించారు. ప్రతి విద్యార్థి భయం లేకుండా నేర్పుగా పరీక్షలు నిబద్ధత రాయాలని సూచించారు. శత శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా విద్యార్థులను సమాయత్తం చేయాలని ఉపాధ్యాయులను సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి వంట కార్మికులకు మెనూ అనుసరించాలని సూచనలు సలహాలు ఇచ్చారు. విద్యార్థులతో ముచ్చటించి వారిలో ఉన్నటువంటి పరీక్ష భయాన్ని పోగొట్టి మంచి మార్కులు పొందే సూచనలు సలహాలు ఇచ్చారు. పాఠశాల సిబ్బంది, సిఆర్ఎంటి దేవరాజు పాల్గొన్నారు.



# రఘువర్మకు పెరుగుతున్న మద్దతు

**- ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సుభాష్‌బాబు**



**మందస, ఫిబ్రవరి 12(వార్త):** ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎ పీ టీ యఫ్ బలపరిచిన మిత్రసంఘాల అభ్యర్థి పి. రఘువర్మ గారికి మిత్ర సంఘాల మద్దతు రోజు రోజు కు పెరుగుతోందని ఏ పీ టీ యఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బి.సుభాష్ బాబు అన్నారు. మందస మండలంలోని మందస, సిరిపురం,కృష్ణాపురం ఉన్నత పాఠశాల లు,చిన్నాకోష్ట, చీపి, మందస, పట్టులోగాం. ఆశ్రమ పాఠశాలలు మరియు మందస జూనియర్ కళాశాలలను సందర్శించి ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కారం కొరకు సరైన వ్యక్తిని శాసనమండలికి పంపించాలని, అందుకు రఘువర్మ తగిన వ్యక్తి అని తెలియజేసారు.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయులు సంఘం, డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్, రాష్ట్ర భాషాఉధ్యాయ సంస్థ, నోబెల్ టీచర్స్ అసోసియేషన్, డిగ్రీ కాలేజీ, జూనియర్ కాలేజీల అసోసియేషన్, డెమోక్రటిక్ పీ ఆర్ టీ యు, ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం,ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాలు, గిరిజన సంక్షేమ పాఠశాలలు, కేజీబీవీ పాఠశాల లు అన్నింటి నుంచి మద్దతు ఉన్న రఘువర్మ గారికి మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించమని ఉపాధ్యాయులు ని కోరారు. ఈ పర్యటన లో ఆయనతో పాటుగా ఏ పి టీ యఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జి. భీమారావు, మందస యస్ యల్ టీ ఏ నాయకులు యస్ అబ్రహం, ఏ పి టీ యఫ్ మందస నాయకులు వి వి వరప్రసాద్, డి. మోహన రావు, డి వైకుంఠ రావు తదితరులు పాల్గొన్నారు.

**రఘు వర్మ ను గెలిపించండి**

**వంగర :** ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పాకలపాటి రఘువర్మను మొదటి ప్రాధాన్యత ఓటు తో గెలిపించాలని ఏ పి టి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల కోరారు. బుధవారం మండలంలోని అరసాడ, వంగర, మద్దివలస సీతారామపురం ఉన్నత పాఠశాలలు, కస్తూరిభ పాఠశాల ఉపాధ్యాయులు తో సమావేశం జరిపి పాకలపాటి రఘు వర్మ కు మద్దతు గా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నీతి, నిజాయితీ కి కట్టుబడి ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం చేస్తున్న వ్యక్తి రఘు వర్మ గారు అన్నారు. విద్యా రంగ సమస్యలపై పోరాటం చేసి శాసన మండలి లో సమస్యలను నిర్భయంగా తెలిజెప్పిన వ్యక్తి ని మరలా గెలిపించుకోవలసిన ఆవశ్యకత ఉందన్నారు. కరోనా బారిన పడి అనేక మంది ఉపాధ్యాయులు చనిపోయిన సందర్భంలో వారి కుటుంబాలను కలిసి బొరోసాను కల్పించి, కారుణ్య నియామకాలు తొందరగా జరిగేలా కృషి చేసారన్నారు. గత 80 సంవత్సరాలు గా ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలను పరిష్కరించటం లో నిరంతరం పోరాటం చేస్తున్నాదన్నారు. ఈ కార్యక్రమం లో ఏ పి టి ఎఫ్ శ్రీకాకుళం, విజయనగరం జిల్లా అధ్యక్షులు మజ్జి మదన్ మోహన్, షేక్ భుఖారి బాబు, ప్రధాన కార్యదర్శి పాలతేరు శ్రీనివాసరావు, నాయకులు మురపాక వెంకటరమణ, లంక రామకృష్ణ, సీతం నాయుడు, ఎం. సత్యం నాయుడు, పాలవలస శ్రీరాములు నాయుడు, గుంటక వాసు, భుగత ఉమామహేశ్వరరావు, జి ఠాగూర్, వై రామకృష్ణ, పి శ్రీకర్, ముగడ రాము తదితరులు పాల్గొన్నారు.



# పలాస వైసిపి మండల అధ్యక్షునిగా దువ్వాడ రవి



**పలాస, ఫిబ్రవరి 12(వార్త):** పలాస మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులుగా అల్లుకోల సర్పంచ్ ప్రతినిధి దువ్వాడ రవి నియమితులయ్యారు. బుధవారం కాశీబుగ్గ ప్రగతి భవన్‌లో పలాస మండల వైసీపీ కార్యవర్గం, నాయకులు, కార్యకర్తలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలాస మండల వైసీపీ అధ్యక్షులుగా రవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తనపై నమ్మకంతో మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకి పలాస మండలం వైసీపీ కార్యవర్గానికి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ, పార్టీ అభివృద్ధికి నిరంతరం పాటుపడతానని రవి అన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పల రాజు, జిల్లా ఉపాధ్యక్షులు పైల చిట్టిబాబు, జిల్లా సెక్రటరీ బత్తిన హెమేశ్వరరావు, పలాస ఎంపీపీ ప్రతినిధి ఉంగ సాయి కృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు, పలాస సర్పంచులు సంఘం అధ్యక్షులు కొర్ల సంతోష్, సీనియర్ నాయకులు బొడ్డు సుధాకర్, రాపాక చిన్నారావ్, సైన దేశయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొని నూతన అధ్యక్షుడిని అభినందించారు.




## టీ స్టాల్ లో భారీ అగ్నిప్రమాదం

**కొత్తూరు, ఫిబ్రవరి 12(వార్త):** కొత్తూరు లోని స్థానిక గోగుల షాపింగ్ మాల్ కు ఆనుకుని ఉన్న టీ స్టాల్ లో బుధవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. టీ స్టాల్‌లో గ్యాస్ వెలిగించే సమయంలో ప్రమాదవశాత్తు ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పక్కనున్న దుకాణదారులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే ఆ షాపింగ్ మాల్‌లో ఉన్న దుకాణదారులు, స్థానికులు అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి వెంటనే చేరుకొని భారీ మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో ఆస్తి నష్టం ఎంతవరకు జరిగిందని స్పష్టంగా తెలియలేదు .ఈ అగ్నిప్రమాదం లో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## పంటలను ధ్వంసం చేసిన ఏనుగుల గుంపు

**భామిని, ఫిబ్రవరి12(వార్త):** భామిని మండలం ఘనసర పంచాయతీ పరిధిలోని పాత ఘనసర గ్రామంలో ఏనుగుల గుంపు బుధవారం సంచరిస్తోంది. పాత ఘనసర గ్రామంలోని మొక్క జొన్న, చెరుకు, ఇతర పంటలను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయని రైతులు వాపోతున్నారు. తక్షణమే ఏనుగుల గుంపును తరలించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని స్థానిక రైతులు కోరుతున్నారు. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్ సిబ్బంది కిల్లారి జగదీశ్వరరావు సూచించారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## మందసలోని రిజర్వాయర్లకు మరమ్మతులు చేయాలి

**మందస, ఫిబ్రవరి 12(వార్త):** మందస మండలంలోని పలు సాగునీటి వనరులు, రిజర్వాయర్లును మరమ్మతులు చేయాలని పలాస ఎంఎల్ఎ గౌతు శిరీషా అన్నారు. ఈ మేరకు ఇరిగేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కృష్ణారావును కలిసి నీటి వనరులు, రిజర్వాయర్ల సమస్యలను వివరించారు. దామోదరసాగరం,కళింగదళ్ రిజర్వాయర్ల కాలువలను మరమ్మతులు చేయించాలన్నారు. నీటి సరఫరాలు, నిలువ సామర్థ్యం తదితర అంశాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. సాగునీటి వనరులను అభివృద్ధి చేసి, రైతులకు న్యాయం చేయాలన్నారు. అన్ని వేళలా సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆమెతో పాటు పీరికట్ల విఠల్ రావు, మందస ఏఈ ఎస్వీ శ్రీనివాసరావు కూడా ఉన్నారు.



# క్రీడలతోనే ఉన్నత అవకాశాలు

**పలాస, ఫిబ్రవరి 12(వార్త):** క్రీడలతోనే ఉన్నత అవకాశాలు వస్తాయిని విద్యా వాహిని కళాశాల ప్రిన్సిపాల్ పైల తిరుమలరావు అన్నారు ఇటీవల చెన్నైలో జరిగిన జాతీయ స్థాయి టెన్నీకాయట్ ఆటల పోటీల్లో పలాస చెందిన కొవ్వూరు ప్రవీణ్ కుమార్ వ్యక్తిగత విభాగంలో నాల్గవ స్థానంలో నిలిచి ప్రతిభ కనబరిచారు. స్థానిక శ్రీ విద్యా వాహిని జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ప్రవీణ్‌కు బుధవారం ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో పాటు విద్యార్థికి విద్యపై ఉండాలని, అప్పుడే ఉన్నత అవకాశాలకు చేరుకుంటాడని చెప్పారు. క్రీడల ద్వారా మంచి అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. విద్యార్థి జాతీయ స్థాయి గుర్తింపు పట్ల అధ్యాపకులు ప్రవీణ్‌కుమార్‌ను అభినందించారు.



## జీవితేశ్వరరావుకు మద్దతు తెలిపిన మాజీ మంత్రి సీదిరి



**పలాస, ఫిబ్రవరి 12(వార్త):** కాంగ్రెస్ నాయకులు డాక్టర్ దువ్వాడ జీవతేశ్వరరావుకు మద్దతు తెలిపిన మాజీ మంత్రి సీదిరీ అప్పలరాజు సాధారణంగా ఆహ్వానించి మద్దతు తెలియజేశారు. బుధవారం డాక్టర్ దువ్వాడ జీవితశ్వరరావు స్వగృహంలో సమావేశమయ్యారు. పలాస ఇందిరా చౌక్ వద్ద భారత మాజీ ప్రధాని స్వర్గీయ శ్రీమతి ఇందిరాగాంధీ విగ్రహం మరల ఏర్పాటు చేసే విషయంలో వివిధ శాఖలకు చెందిన స్థానికంగా ఉన్న కొంతమంది ప్రభుత్వ అధికారులు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు పట్ల వ్యవహరించిన తిరుకు మనస్తాపం చెందారుని, ఆ విషయం తెలుసుకుని మాజీ మంత్రివర్యులు డాక్టర్ సీదిరి, స్థానిక వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దువ్వాడ జీవితేశ్వరరావు ఇంటికి వెళ్లి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు శిస్టు గోపి, మండల పార్టీ అధ్యక్షులు దువ్వాడ రవి, వైసిపి మాజీ మండల అధ్యక్షులు పైల వెంకటరమణ (చిట్టి), కౌన్సిలర్లు బాలల శ్రీనివాసరావు. సప్త సింహాచలం, కాంగ్రెస్ పార్టీ నాయకులు మధుబాబు, రామారావు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుల హాజరు తనిఖీ చేసిన కమిషనర్

**పలాస, ఫిబ్రవరి 12(వార్త):** పలాస కాశీబుగ్గ పురపాలక సంఘంలో రోజువారీ శానిటేషన్ పరిశీలనలో భాగంగా బుధవారం మున్సిపల్ కమిషనర్ పలాస కొత్త వీధిలో ఉన్న, పలాస సర్కిల్ పారిశుధ్య కార్మికుల మస్తరు ఆఫీసులో హాజరును తనిఖీ చేశారు. అనంతరం కాశీబుగ్గ 14వ వార్డు మూడు రోడ్ల జంక్షన్ రోడ్ స్విపింగు పరిస్థితిని సమీక్షించారు. 13వ వార్డు న్యూ కాలనీలోగార్బేజ్ లిఫ్టింగ్ ప్రక్రియను పరిశీలించారు. తరువాత కాశీబుగ్గ ఓల్డ్ బస్టాండ్ రోడ్లో 'అన్న క్యాంటీన్'లో బ్రేక్ ఫాస్ట్ ఫుడ్ స్టాండర్డ్ టైంని పరిశీలించారు. వినియోగదారులకు ఇచ్చిన బ్రేక్ ఫాస్ట్ మెనూలో క్వాలిటి- క్వాంటిటీ తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సరఫరా చేయాలని నిర్వాహకులను ఆదేశించారు.





## జానకిరామ్ రెడ్డికి ఘన సన్మానం

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 12(వార్త):** మశాకపురం గ్రామానికి చెందిన ప్రముఖ తెలుగు సాహితీవేత, జానపద సంగీత కళాకారుడు రంగాల జానకిరామరెడ్డి ఇటీవల విజయవాడ తుమ్మనపల్లి కళాక్షేత్రంలో కాళోజి బుక్ ఆఫ్ రికార్డ్, తెలుగు వెలుగు జాతీయ సాహితీ వేదిక ఆధ్వర్యంలో ప్రముఖులచే జాతీయ నంది అవార్డు పొందారు. రంగాల జానకిరామ్ రెడ్డికి ఎంపీపీ బోర పుష్ప, వైఎస్ ఆర్సిపి మండల అధ్యక్షుడు పాతిర్ల రాజశేఖర్, మాజీ ఎంపీపీ కారింగి మోహన్ రావు, వైస్ ఎంపీపీ దువ్వ వివేకానంద రెడ్డి, లు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ జెడ్పిటిసి నూకయ్య, రంగాల కృష్ణారెడ్డి, సర్పంచులు నర్తు ప్రసాద్, సారంగి త్రినాథ్ రెడ్డి, నీలపు సారథి, ప్రియ, బదకల మోహన్ దాస్, దుక్క ధనలక్ష్మి, ఆసి పురుషోత్తం, బాకీ లక్ష్మీనారాయణ, నగిరెడ్ల చిరంజీవి, దూడ రాజేష్, కొత్తపల్లి భీముడు, బింగి నీలాద్రి, దుపనా వెంకటరావు పాల్గొన్నారు.

## జేఈఈ మెయిన్స్‌లో కొల్లి చరణ్ ప్రతిభ



**వంగర, ఫిబ్రవరి 12(వార్త):** మారుమూల గ్రామంలో వ్యవసాయ కుటుంబంలో పుట్టినప్పటికీ సరస్వతీపుత్రుడు అనిపించుకున్న కొల్లి చరణ్ ప్రతిభ ఇది. వంగర మండలం జేకే గుమ్మడ గ్రామానికి చెందిన చరణ్ ఇటీవల జరిగిన జేఈఈ(మెయిన్స్)లో 98 శాతం మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. చరణ్ స్కోర్ పరిశీలిస్తే భౌతిక శాస్త్రంలో 98.4 శాతం, రసాయన శాస్త్రంలో 97.5 శాతం గణితంలో 97.89 శాతం మార్పులు సాధించడం విశేషం. ఈయన సామాన్యమైన వ్యవసాయ కుటుంబానికి చెందిన కొల్లి తిరుపతిరావు గీత దంపతుల రెండవ కుమారుడు. చదువులో ప్రతిభకనపరిచిన చరణ్ ను గ్రామస్తులు, విద్యార్థికులు అభినందిస్తున్నారు.

## చిన్నారావు జ్ఞాపకార్థం వంట పాత్రల వితరణ



**పలాస, ఫిబ్రవరి 12(వార్త):** స్వర్గీయ గేదెల చిన్నారావు పెద్ద కర్మ సందర్భంగా ఆయన భార్య భానుమతి, కుటుంబసభ్యులు బొడ్డపాడు అగ్నికులక్షత్రియ సంఘానికి రూ.50,000విలువ గల వంట పాత్రలు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారావుకు ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో కుల పెద్దలు నాయుడు, పోతనపల్లి లక్ష్మణ్ రావు, ప్రధాన కార్యదర్శి బొడ్డు దుష్యంత్, కోశాధికారి బుడత ధనరాజ్ , బొడ్డు మహాలక్ష్మి, బొడ్డు మోహన్ రావు (నాయుడు), బొడ్డు సింహాద్రి, తామాడ రామారావు, బత్తిని వాసుదేవ్,గుజ్జు దశరథరావు, బైనపల్లి లోకనాథం, బొడ్డు జగన్, బైనపల్లి భీమారావు,కుత్తుమ్ హేమలయ్య, తామాడ గంగయ్య, బుడత కాంతారావు, పోతనపల్లి మాధవరావు,పోతనపల్లి మన్మధరావు, గర్తం కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే బుకింగ్ సూపర్‌వైజర్‌కు అవార్డు

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి12(వార్త):** ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్లో చీఫ్ బుకింగ్ సూపర్ వైజర్ గా పనిచేస్తున్న అడ్డుదోలాయి రమణ కు అవార్డు లభించింది. ఇటీవలి ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ పుంక్వాల్ స్టేషన్ లో వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా బుకింగ్ సేవలు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే ఖుర్ధ డివిజనల్ మేనేజర్ హర్భజన్ సింగ్ బజ్వా ఐదు వేల రూపాయలు చెక్కు ను అవార్డ్ రూపంలో అందజేశారు. స్థానిక స్టేషన్ సిబ్బంది రమణ కు శుభాకాంక్షలు తెలియజేశారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546